ఖరీఫ్‌కు సుడిదోమ దెబ్బ

తోటపల్లిగూడూరు : వరి పంటను సుడిదోమ నాశనం చేసి ఖరీఫ్‌ను అతలాకుతలం చేస్తోంది. మండలంలో ఖరీఫ్ కింద ప్రస్తుతం 14 వేల ఎకరాల్లో వరిసాగు ఉంది. ఇది చిరుపొట్ట దశలో ఉంది. కాగా ఈ ఖరీఫ్ వరిసాగులో సుడిదోమ ప్రతాపం చూపుతోంది. నత్రజని ఎరువులు అధికంగా వాడడం మూలంగా ఎండ తీవ్రత వల్ల కూడా సుడిదోమ అధికమవుతోంది. గోధుమ రంగులో ఉండే సుడిదోమ మొక్కల మొదళ్లలో గుంపులుగా చేరి ఆకులు, కాండం నుంచి రసాన్ని పీల్చడం వల్ల మొక్కలు ఎండిపోతున్నాయి. ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది సుడిదోమతో ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు వాపోతున్నారు. ఎన్నిరకాల మందులను వినియోగించినా ఫలితం దక్కడం లేదని రైతులు వెల్లడిస్తున్నారు.



పేడూరులో సుడిదోమ సోకిన వరి పైరుకు మందు పిచికారీ చేస్తున్న రైతు

ఇలా చేయండి

సుడిదోమ నివారణపై మండల వ్యవసాయాధికారులు రైతులకు పలు సూచనలు, సలహాలు చేస్తున్నారు. వరిపొలంలో కాలిబాటలు తీసి గాలి సక్రమంగా ఉండే విధంగా రైతులు చర్యలు తీసుకుంటే సుడిదోమ నుంచి రక్షణ పొందవచ్చన్నారు. అలాగే అంకురం దశలో ఉన్న పైరుకు సుడిదోమ సోకితే ఎకరానికి మూడు గ్రాముల కార్బోఫ్యూరాన్ అనే మందును పది కేజీల ఇసుకతో కలిపి చల్లుకోవాలన్నారు. దీంతో పాటు వ్యవసాయాధికారుల సూచించిన సస్యరక్షణ చర్యలను చేపట్టి సుడిదోమను నివారించుకోవాని తెలియజేస్తున్నారు.

మాజీ మంత్రి కాకాణి పరామర్శ

వెంకటాచలం : మండలంలోని నిడిగుంటపాళెం మాజీ సర్పంచ్ కత్తి సుబ్బమ్మ కుటుంబ సభ్యులను మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. నెల్లూరు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ కత్తి సుబ్బమ్మ మృతిచెందగా, ఆమె భర్త ప్రసాద్‌కు గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నిడిగుంటపాళెం గ్రామానికి వచ్చి సుబ్బమ్మ భర్త ప్రసాద్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కట్టంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కొణిదెన విజయభాస్కర్‌నాయుడు, అడపాల ఏడుకొండలు, పైనం నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రసాద్‌ను పరామర్శిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

రైతులు బిల్లులను అడిగి తీసుకోవాలి



ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

- ప్రకాశం జిల్లా ఏడీఏ రమణ
- విజిలెన్స్ రాకతో దుకాణాల మూత

పొదలకూరు : ఎరువులు, పురుగు మందులను కొనుగోలు చేసే సమయంలో బిల్లులను అడిగి తీసుకోవాలని ప్రకాశం జిల్లా నుంచి వచ్చిన విజిలెన్స్ ఏడీఏ రమణ రైతులకు సూచించారు. పట్టణంలోని సాయిబాబా ఏజెన్సీలో మంగళవారం ఎరువులు, పురుగు మందులు, విత్తనాల అమ్మకాల రికార్డులను విజిలెన్స్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రైతు ఎరువులు కొనుగోలు చేసిన వెంటనే బిల్లు తీసుకునే అలవాటు చేసుకోవాల్సిందిగా సూచించారు. బిల్లులు అడిగినా ఇవ్వకుంటే వెంటనే వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేయాల్సిందిగా సూచించారు. ఖరీఫ్‌లో పంటల సాగు కోసం ఎరువులు, పురుగు మందులను వ్యాపారులకు అందుబాటులో ఉంచాల్సిందిగా పేర్కొన్నారు. వ్యవసాయశాఖ కమిషన్ ఆదేశాల మేరకు తనిఖీలకు వచ్చినట్లు పేర్కొన్నారు. అయితే పట్టణంలో చాలామంది వ్యాపారులు తమ దుకాణాలను మూసుకుని వెళ్లారని, ఇది చట్టరీత్యా నేరమన్నారు. వారికి వ్యవసాయశాఖ నుంచి నోటీసులను అందజేస్తామని స్పష్టం చేశారు. సాయిబాబా ఏజెన్సీలో చిన్నపాటి పొరపాట్లు ఉన్నాయని, వాటికి సంబంధించిన బిల్లులను చూపితే అమ్మకాలను పునరుద్ధరించడం జరుగుతుందన్నారు. విత్తనాలకు సంబంధించి 250 కిలోలు, ఎరువులకు సంబంధించి 69 టన్నుల యూరియా, పురుగు మందులకు సంబంధించి రూ.76,200లు నగదు రికార్డుల్లో సక్రమంగా లేవని స్థానిక ఏఓకు రికార్డులు చూపితే అమ్మకాలను యథావిధిగా కొనసాగించుకోవచ్చన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ సుధాకర్‌రెడ్డి, నెల్లూరు, పొదలకూరు ఏడీఏలు నర్సోజీరావు, కె.శివనాయక్ పాల్గొన్నారు.

పోర్టులో ట్రక్‌వీల్ వాషింగ్ యంత్రం ప్రారంభం



వాషింగ్ ప్రక్రియను ప్రారంభించిన యంత్రం

ముత్తుకూరు : అదానీ కృష్ణపట్నం పోర్టు నుంచి వెలుపలకు వెళ్లే వాహనాల చక్రాల నుంచి ధూళి, దుమ్ము, శిథిలాలను తొలగించేందుకు అధునాతన ట్రక్ వీల్ వాషింగ్ యంత్రాన్ని ఉపయోగిస్తున్నట్లు సీఈఓ జీజే రావు అన్నారు. సౌత పోర్టు మార్గంలో వెళ్లే వాహనాలను శుద్ధి చేసేందుకు ఏర్పాటు చేసిన వాషింగ్ వీల్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ అధునాతన యంత్రం ఆయిల్ స్కిమ్మర్, ఆటోమేటిక్ సెన్సార్ ఆధారిత సాంకేతికతను కలిగి ఉందన్నారు. దీని వల్ల నీటి వినియోగం తగ్గుతుందని, కడిగిన నీటిని రీ సైక్లింగ్ చేసి మళ్లీ ఉపయోగించే వీలు ఉంటుందన్నారు. చట్టబద్ధమైన నిబంధనలు పాటించడంలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందన్నారు. సీఓఓ రాజన్‌బాబు, అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, కార్పొరేట్ అఫైర్స్ హెడ్ కేఎం రామ్, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతాక్రమంలో సమస్యల పరిష్కారం

- కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కొడవలూరు : ప్రాధాన్యతా క్రమంలో ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలోని యల్లాయపాళెం గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆమె సందర్శించి సమస్యలపై అధికారులతో చర్చించారు. అనంతరం ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తానన్నారు. సచివాలయ అధికారులు ప్రభుత్వ పథకాలను తారతమ్యాల్లేకుండా అందించాలని సూచించినట్లు తెలిపారు. కార్యాలయానికి ఏవైనా పనులపై వచ్చిన వారి ని మర్యాదపూర్వకంగా ఆహ్వానించి సమస్యలను అడిగి తెలుసుకోవాలని ఆదేశించామన్నారు. సమస్యలపై వచ్చే వారికి నాయకులు సహాయకులుగా ఉండి సమస్యల పరిష్కారంలో సహకారాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వి.ప్రద్యుమ్నకుమార్, టీడీపీ నాయకులు కె.అమరేంద్రరెడ్డి, కె.కమలాకర్‌రెడ్డి, జీవీఎస్.శేఖర్‌రెడ్డి, ఎం.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కె.వెంకటరమణారెడ్డి, జి.రాజేంద్ర, బి.విజయకుమార్, విశ్వనాథ్, బి.శ్రీనివాసులు, పి.రవి పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా పద్మసాలి సేవా సంఘం వారు వ్యవహరించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం వందలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. తిరిగి సాయంత్రం స్వామికి పూజలు, పల్లకిసేవ జరిపించారు.

ఉన్నత స్థానానికి చేరుకోవాలి



మాట్లాడుతున్న మహేంద్రరెడ్డి

నెల్లూరు సిటీ: కృషి, పట్టుదలతో పాటు చదవడం, రాయడం, స్పష్టంగా మాట్లాడటం ద్వారా జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి మహేంద్రరెడ్డి పేర్కొన్నారు. వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై నగరంలోని డీకే డబ్ల్యూ జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని జిల్లా యువజన సంక్షేమ శాఖ, సెట్నెల్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ స్కిల్స్ అవశ్యతకను వివరించారు. సెట్నెల్ మేనేజర్ శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ శ్రీనివాసులు, గయాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు-బెంగళూరు ఆర్టీసీ సర్వీసు ప్రారంభం



ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రతి రోజూ సాయంత్రం 7 గంటలకు బెంగళూరుకు బస్సు బయలుదేరేలా నూతన సర్వీసును సోమవారం ప్రారంభించినట్లు ఆర్టీసీ అధికారులు మంగళవారం తెలిపారు. ఆత్మకూరు నుంచి మర్రిపాడు మీదుగా వెళ్లే ఈ బస్సు టిక్కెట్ ధర రూ.720గా నిర్ణయించినట్లు డిపో అసిస్టెంట్ మేనేజర్ కల్పన తెలిపారు. ఇప్పటికే ఆత్మకూరు నుంచి రాత్రి 8, 9 గంటలకు బెంగళూరు వెళ్లేందుకు సూపర్‌లగ్జరీ బస్సు నడుపుతున్నామని ఆత్మకూరు నుంచి అనంతసాగరం మీదుగా బద్వేల్ వైపు బెంగళూరుకు వెళ్లేందుకు మరో బస్సును ప్రయాణికులకు అందుబాటులో ఉంచామని తెలిపారు. ప్రతి రోజూ అదనంగా 4వ బస్సును కూడా అందుబాటులో ఉంచామని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సింహపురికి ఉడుపి శిరూర్ పీఠాధిపతి రాక

నెల్లూరు(బృందావనం): సంతపేటలోని బ్రాహ్మణవీధిలో గల వ్యాసరాజ మఠానికి ఉడుపి శిరూర్ మఠ పీఠాధిపతి వేదవర్ధన తీర్థ మంగళవారం విచ్చేశారు. మఠంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న విశేష పూజా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు గానూ వచ్చిన ఆయనకు సుధాపండితులు ప్రహ్లాదాచారి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు ఆహ్వానం పలికారు. సంస్థాన పూజను వేదవర్ధన తీర్థ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ఏడు నుంచి తొమ్మిది వరకు నిర్వహించనున్నామని మఠం మేనేజర్ తడకపల్లి రవీంద్రబాబు, గౌరవాధ్యక్షుడు అర్వపల్లి సుబ్బారావు తెలిపారు. సింహపురి మధ్వ సంఘ అధ్యక్షుడు దేవరసు ప్రవీణ్ పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

ఉదయగిరి: పట్టణంలో మంగళవారం ఓ పిచ్చి కుక్క స్వైరవిహారం చేసి పలువురిని గాయపరిచినట్లు స్థానికులు తెలిపారు. పట్టణంలోని సినిమా హాలు వీధి, యూనియన్ రోడ్డు, పోలీస్‌స్టేషన్ సమీపంలో చిన్నారులు, మహిళలు, వృద్ధులపై పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. ప్రధానంగా పోలీస్‌స్టేషన్ సమీపంలోని చికెన్ దుకాణాల వద్ద కుక్కలు గుంపులు చేసి వాహనదారులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

అర్ధనారీశ్వరి అలంకారంలో పోలేరమ్మ



మనుబోలు : మనుబోలు కోదండరామపురం దేవాంగుల వీధిలో కొలువైన పోలేరమ్మ ఆలయంలో మంగళవారం పోలేరమ్మను అర్ధనారీశ్వరిగా అలంకరించారు. ఆషాడ మాసం మొదటి మంగళవారాన్ని పురస్కరించుకుని అర్చకుడు శ్రీనివాసులు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా యారాశి రవికుమార్, శివలక్ష్మి దంపతులు వ్యవహరించారు.

విశ్వనాథునికి రుద్రాభిషేకం



ప్రత్యేకాలంకరణలో విశ్వనాథుడు

మనుబోలు : మనుబోలు, చెర్లోపల్లి రైల్వే గేటు సమీపంలో ఉన్న విశ్వనాథస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి వివిధ రకాల సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు విశ్వనాథస్వామికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

80 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు

కొడవలూరు : పీఎం మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా కొడవలూరు పీహెచ్‌సీలో నారాయణ వైద్యశాల గర్భకోశ వ్యాధుల నిపుణురాలు జి.భార్గవి మంగళవారం గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా 80 మందిని పరీక్షించి మందులు, వైద్య సలహాలు ఇవ్వడంతో పాటు రక్తశాతం తక్కువ ఉన్న నలుగురు గర్భిణులకు తగిన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రామకృష్ణ మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కాన్పు సమయంలో ప్రమాదకర పరిస్థితి నెలకొంటుందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని వైద్య నిపుణులతో గర్భిణులకు పరీక్షలు చేయించి ఆరోగ్యకర బిడ్డకు జన్మనిచ్చేలా చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని గర్భిణులు పెద్ద సంఖ్యలో సద్వినియోగం చేసుకోవడం శుభ పరిణామమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ టి.సోమశేఖర్, హెచ్ఎస్ వి.రామ్మోహన్, హెచ్ఏలు వెంకట్రావు, షఫీఉద్దీన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణురాలు భార్గవి

మట్టి నమూనాల సేకరణపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న వ్యవసాయాధికారులు

కొడవలూరు : మండలంలోని చంద్రశేఖరపురం ఈఎంఆర్ఎస్(ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్) పాఠశాల విద్యార్థులకు మట్టి నమూనాల సేకరణపై వ్యవసాయాధికారులు మంగళవారం శిక్షణ ఇచ్చారు. మట్టి నమూనాలను ఏ విధంగా సేకరించాలో విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరించడంతో పాటు మట్టి నమూనాల ఆవశ్యకత, ప్రయోజనాల గురించి తెలియజేశారు. పొలాల్లో మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్షలు చేయించడం ద్వారా ఎరువులు, పురుగు మందులు పరిమిత మోతాదులో వినియోగించి వ్యవసాయ ఖర్చులు గణనీయంగా తగ్గించుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఏఓ సీహెచ్ఎస్ లక్ష్మి, ఏఈఓ ఎ.అనూష, వీఏఏ ఒ.సుజిత్, గురుకుల ఉపాధ్యాయులు ధీరజ్, టకీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాకే తలమానికంగా నగరవనం

నెల్లూరు(అర్బన్): కొత్తూరు సమీపంలోని అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న నగరవనాన్ని జిల్లాకే తలమానికంగా, అత్యాధునిక వసతులతో నిర్మిస్తున్నామని జిల్లా అటవీశాఖాధికారి చంద్రశేఖర్ తెలిపారు. వేదాయపాళెంలోని అటవీ శాఖ కార్యాలయంలో అధికారులతో సమావేశాన్ని సీసీఎఫ్ శ్రీనివాసులురెడ్డితో కలిసి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడారు. జీవ వైవిధ్యమున్న అనేక రకాల జంతువులు నగరవనంలో ఉన్నాయన్నారు. అటవీ ప్రాంతాన్ని పరిచయం చేస్తూ ఎంతో విజ్ఞానాన్ని అందించేలా పనులను చేపడుతున్నామని వివరించారు. వాకింగ్ ట్రాక్, ఎంట్రీ ఆర్చ్, షెల్టర్లు, నీటి వనరులు, యోగా సెంటర్, కృత్రిమ వాటర్ ఫాల్స్, క్రీడా పరికరాలు తదితర 57 రకాల నిర్మాణాలు జరుగుతున్నాయని వివరించారు. అక్కడ తిరిగే పక్షులు, జంతువుల రక్షణకు చర్యలు చేపట్టామని వెల్లడించారు. నగరవనం వ్యూ కనిపించేలా ఎత్తయిన ప్రదేశాన్ని నిర్మిస్తున్నామని.. బైనాక్యులర్ సాయంతో అక్కడి జీవ వైవిధ్యాన్ని పరిశీలించొచ్చని పేర్కొన్నారు. రేంజర్, సెక్షన్ ఆఫీసర్లు తదితరులు నిత్యం పర్యవేక్షిస్తూ నగరవన పనులను వేగవంతం చేయాలని కోరారు. ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ మారుతిప్రసాద్, నెల్లూరు రేంజర్ మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చంద్రశేఖర్

కలెక్టర్‌ను కలిసిన ఎన్జీఓ నేతలు

నెల్లూరు(పొగతోట): నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ ఆనంద్‌ను కలెక్టరేట్‌లో ఏపీ ఎన్జీఓ నేతలు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలను తెలియజేశారు. ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి నాయుడు వెంకటస్వామి, ఆర్గనైజింగ్ కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ, ఉపాధ్యక్షుడు ఈదూరు కరుణమ్మ, సంయుక్త కార్యదర్శులు ఈదూరు విజయకుమార్, లక్కాకుల పెంచలయ్య, సువర్ణ, జిల్లా మహిళ చైర్‌పర్సన్ ఉదయగిరి చిన్నమ్మ, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



ఆర్యవైశ్య సంఘం మండల కార్యవర్గం ఎంపిక

అల్లూరు: ఆర్యవైశ్యుల సంఘం అల్లూరు మండల కార్యవర్గాన్ని స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మంగళవారం ఎంపిక చేశారు. ఆ సంఘం గౌరవాధ్యక్షుడిగా డి.బ్రహ్మానందం, అధ్యక్షుడిగా మొగళ్లపల్లి నాగేశ్వరరావు, సెక్రటరీగా వై.సురేంద్రబాబు, కోశాధికారిగా పి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా కె.బ్రహ్మానందం, గోళ్ల బాలాజీ, జె.వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులుగా ఎం.సత్యనారాయణ, ఎం.ప్రసాద్, కృష్ణమూర్తి, సహాయ కోశాధికారులుగా ఎం.సురేష్, పి.శేఖర్, హరీష్, మహిళా కమిటీ అధ్యక్షురాలిగా చక్కా జ్యోతి, కార్యదర్శిగా మద్దాలి సీతాకల్యాణి, ట్రెజరర్‌గా పాత్తూరు సుకన్యను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

చిన్నారులంతా బడిలోనే ఉండాలి



డ్రాపౌట్స్‌పై ఎంఈఓలు, హెచ్‌ఎంలతో చర్చిస్తున్న అధికారులు



'నేను బడికి పోతా' ర్యాలీలో పాల్గొన్న ప్రత్యేక తనిఖీ బృందం అధికారులు

- పాఠశాలలను పరిశీలించిన ప్రత్యేక తనిఖీ బృందం

కొడవలూరు : బడిఈడు వచ్చిన చిన్నారులు బడిలోనే ఉండాలని, దీనిపై ఉపాధ్యాయులు, అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రత్యేక తనిఖీ బృందం అధికారులు తెలియజేశారు. మండలంలోని కొడవలూరు ఎన్టీఆర్ కాలనీ, నార్తురాజుపాళెం సీబీఎన్ కాలనీ, యల్లాయపాళెం తేళ్లమిట్ట గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలలు, యల్లాయపాళెం ఉర్దూ పాఠశాలను ప్రత్యేక తనిఖీ బృందం అధికారులు మంగళవారం పరిశీలించారు. ఆయా పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్యపై ఆరాతీశారు. అనంతరం ఆయా గ్రామాల్లోని డ్రాపౌట్స్ చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను బడికి పంపాలని సూచించారు. అనంతరం ఎంఈఓలు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ 6 నుంచి 14 ఏళ్లలోపు చిన్నారులు బడి బయట ఉండరాదన్నారు. ఏ పాఠశాల పరిధిలోనైనా డ్రాపౌట్స్ ఉంటే సంబంధిత హెచ్‌ఎం బాధ్యత వహించాలన్నారు. ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి డ్రాపౌట్స్‌ను గుర్తించడంతో పాటు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేసి పిల్లలను బడికి పంపేలా చేయాలని ఆదేశించారు. తొలుత ఎన్టీఆర్ కాలనీ, యల్లాయపాళెంలో జరిగిన 'నేను బడికి పోతా' ర్యాలీల్లో వారు పాల్గొన్నారు. ప్రత్యేక తనిఖీ బృందంలో ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎస్కే ఖాజామొహిద్దీన్, ప్రత్యామ్నాయ పాఠశాలల సమన్వయకర్త ఎల్వీకే సుబ్రహ్మణ్యం, ఐటీడీఏ ఏఎంఓ వై.శాంతకుమారి, ఐటీడీఏ డీసీడీఓ శాంతి ఉన్నారు. తనిఖీ బృందం అధికారుల వెంట ఎంఈఓలు జి.వసంతకుమారి, ఎస్.అంకయ్య, యల్లాయపాళెం హైస్కూల్ హెచ్‌ఎం ఎ.మోహనరామలింగయ్య, ఉపాధ్యాయుడు నరహరి, సీఆర్‌ఎంటీ ఎం.దయాకర్, జె.పెంచలరావు తదితరులు ఉన్నారు.